క్లుప్తంగా

ముగిసిన ఈజీఎస్ గ్రామసభలు



మాట్లాడుతున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామ సభలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్ గ్రామంలో ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. గతంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై గ్రామస్తులతో చర్చించి, పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్, టీఏ, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా ఆదిలక్ష్మి ఆశ్రమంలో వార్షికోత్సవాలు



హోమం చేస్తున్న పండితులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి బతుకమ్మతండా సమీపంలోని ఆదిలక్ష్మి ఆశ్రమం ఆరవ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ముంగి పీఠాధిపతి దేవగిరి మహారాజ్ ఆధ్వర్యంలో ఆశ్రమ అర్చకుడు చరణ్‌గిరి మహారాజ్ హోమంతో పాటు శివలింగానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి



మోటార్‌ని ప్రారంభిస్తున్న వెంకట్‌రామిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు తనవంతు కృషి చేస్తానని సీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దంతన్‌పల్లి గ్రామంలో రూ.30 వేల తన సొంత నిధులతో సింగిల్ ఫెస్ మోటార్ ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



పెద్దశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడిగా పెద్దశంకరంపేట మండల కేంద్రానికి చెందిన మాజీ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మహంకాళి కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. శుక్రవారం రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు జయరాములు, మండలాధ్యక్షుడు కనకరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామపంచాయతీ భవనంలో నాగుపాము



పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని గ్రామపంచాయతీ భవన ఆవరణలో నాగుపాము సిబ్బందిని ఆందోళనకు గురిచేసింది. శుక్రవారం పంచాయితీ ఆవరణలోని ఓ గదిలో 108 సిబ్బంది నివాసం ఉంటున్నారు. రోజు మాదిరిగా విధులు ముగించుకొని వచ్చిన సిబ్బంది, గది తాళం తీయగా నాగుపాము కనిపించింది. దీంతో వారు భయాందోళనకు గురయ్యారు. సిబ్బందిని చూసిన పాము అక్కడి నుంచి వెళ్లిపోయింది.

అంతటా రిజర్వేషన్లు అమలు చేయాలి

నర్సాపూర్: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని హోలియదాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. ప్రైవేట్ రంగ సంస్థలలో రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో చట్టం చేస్తేనే దళితులకు, గిరిజనులకు న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి

చేగుంట(తూప్రాన్): సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై వ్యక్తి దాడి చేసిన సంఘటన మండలంలోని కర్నాల్‌పల్లి సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాల్‌పల్లి సబ్‌స్టేషన్‌లో శ్రీనివాస్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సురేశ్ అనే వ్యక్తి సబ్‌స్టేషన్ విద్యుత్ వైర్లపైకి ఇనుపరాడ్‌తో విసిరే ప్రయత్నం చేయడంతో ఆపరేటర్ శ్రీనివాస్ అడ్డుకున్నాడు. దీంతో అతను ఆపరేటర్ శ్రీనివాస్‌పై దాడి చేయగా, తలకు గాయాలయ్యాయి. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.



నర్సాపూర్ రూరల్: ఆత్మనంద ఆశ్రమంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మెదక్ మున్సిపాలిటీ: కోదండ రామాలయంలో..



శివ్వంపేట(నర్సాపూర్): సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలోని మండలాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇళ్లల్లో తులసి చెట్లను అందంగా అలంకరించి, ఉసిరి దీపాలు వెలిగించారు. సాయంత్రం ఆలయాల్లోనూ భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్):చాముండేశ్వరి ఆలయంలో ..



పెద్దశంకరంపేట మాణిక్‌ప్రభు ఆలయంలో ..



చేగుంట మహంకాళి ఆలయంలో...



కొల్చారం(నర్సాపూర్): వీరభద్రాలయంలో..



నర్సాపూర్ శివాలయంలో భక్తులు



నర్సాపూర్: హనుమాన్ ఆలయంలో హారతి ఇస్తున్న మహిళలు



శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ ఆలయంలో..



తూప్రాన్ శివాలయంలో ..



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో..



తూప్రాన్‌లో గీతా మందిరంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు



చిన్నశంకరంపేట(మెదక్): కామారం రేణుకామాత ఆలయంలో..



కౌడిపల్లి(నర్సాపూర్): దీపకాంతులతో వెలిగిపోతున్న తునికి నల్లపోచమ్మ



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్ హనుమాన్ ఆలయంలో..

రోగులకు ఉచిత వాహనం ఏర్పాటు

నర్సాపూర్: పట్టణ ప్రజలు ఆస్పత్రులకు వెళ్లేందుకు ప్రతీ మంగళవారం ఉచిత వాహనాన్ని డిసెంబర్ ఒకటి నుంచి ఏర్పాటు చేయనున్నట్లు పదో వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ఆస్పత్రులకు మంగవారం ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, ఇతర రోగులు వస్తుంటారని వారికి సైతం ఉచిత వాహన సేవల అందుబాటులో ఉంటాయని చెప్పారు. వాహనం కావాలనుకునే వ్యక్తులు 96180 80342 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని శివాలయం, మల్లన్న గుడికి వెళ్లేందుకు భక్తులకు రవాణా సౌకర్యార్థం ఉచిత వాహనం ఏర్పాటు చేశారు. ఆయన పలువురు నాయకులతో కలిసి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.



ఉచిత వాహనాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

రోడ్డు పక్కనే చెత్త

నర్సాపూర్: జాతీయ రహదారి పక్కనే చెత్త వేస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు మున్సిపాలిటీ సిబ్బంది పట్టణంలో సేకరించిన చెత్తను నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఆలయ భూముల్లో పారవేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే డంప్‌యార్డు ఉన్నప్పటికీ ఆలయ భూముల్లో సిబ్బంది చెత్తను పారవేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో చెత్తలో ఉండే ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు గాలి వీచినప్పుడు రోడ్డు వైపు వచ్చి రోడ్డుపై వెళ్లే వాహనదారులపై పడడంతో వాహనాలు అదుపు తప్పడంతో వారు కిందపడి గాయాలపాలవుతున్నారు. పట్టణంలో సేకరించే చెత్తను డంప్‌యార్డులో పార వేసేలా అధికారులు చర్యలు తీసుకొని జాతీయ రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



దేవాలయ భూముల్లో పారవేసిన చెత్తా చెదారం

కారు ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

మనోహరాబాద్(తూప్రాన్): విధులు ముగించుకొని రోడ్డుపై వెళ్తున్న సెక్యూరిటీ గార్డును కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన దుడ్డోజు సంజీవచారి(52) పది రోజుల కిందట మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ఉంటూ స్థానికంగా ఉన్న గ్లోస్టర్ కేబుల్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకొని జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా తూప్రాన్ వైపు నుంచి మేడ్చల్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజీవచారికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు పల్టీలు కొట్టగా బెలూన్స్ ఓపెన్ కావడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: మండలంలోని మూడు గ్రామాల్లో కరెంట్ పనులు చేయనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మంభోజిపల్లి, ర్యాలమడుగు, పేరూర్ గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడీఈ తెలిపారు. ఈ విషయంలో ఆయా గ్రామాల ప్రజలు తమకు సహకరించాలని ఏడీఈ మోహన్‌బాబు కోరారు.

పాపన్నపేట పరిధిలో..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపల్లి, గాంధారిపల్లి, పొడిచన్‌పల్లి, నాగ్సాన్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నర్సింలు తెలిపారు. పొడిచన్‌పల్లి 33 కేవీ ఫీడర్ మరమ్మతులతో ఈ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌గేట్ వద్ద నూతనంగా నిర్మించిన శివ పంచాయతన నవగ్రహ సహిత సంజీవాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని హనుమాన్ యూత్ సభ్యులు శుక్రవారం తెలిపారు. శనివారం గో, గురు, గణపతిపూజ, స్వస్తివాచనం, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం, పంచామృతధివాసం, ప్రదోషకాలపూజలు నిర్వహించనున్నారు.

రోడ్లకు దూరంగా ధాన్యం ఆరబోయాలి

కొల్చారం(నర్సాపూర్): రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రహదారులకు దూరంగా ధాన్యాన్ని ఆరబోయాలని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం తూకం, రవాణాపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారులపై ధాన్యాన్ని ఆరబోయడం, ధాన్యం కుప్పలపై నలుపు రంగు టార్పాలిన్లు కప్పడం, రాళ్లు అడ్డుపెట్టడం వంటి వాటితో వాహనదారులు ప్రమాదాలకు గురవడం, కొన్ని సమయాల్లో ప్రాణాలు సైతం పోతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతీ రైతు గమనించి, పోలీసులకు సహకరించాలన్నారు. ధాన్యం కొనుగోలు, రవాణాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన పోలీస్‌శాఖ అధికారులు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహమ్మద్ గౌస్, పీఏసీఎస్ చైర్మన్ మనోహర్, రాజాగౌడ్, రైతులు ఉన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

దాతల సాయంతో ఆలయ అభివృద్ధి



మహాద్వారాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరశర్మ, రమేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): దాతలు వస్తు, ధన రూపంలో అందిస్తున్న సాయంతోనే బగలాముఖీ శక్తిపీఠం దినదిన అభివృద్ధి చెందుతుందని వేద పండితుడు, బగలాముఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, ఆలయ భూదాత రమేశ్‌గుప్తా అన్నారు. శివ్వంపేటకు చెందిన దివంగతులైన రాజమణిసత్యగౌడ్, శంకర్‌గౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పద్మ, అశ్విని, రాజేశ్వర్‌గౌడ్ రూ.10 లక్షల సొంత నిధులతో ఆలయం వద్ద నిర్మించిన మహాద్వారాలను శుక్రవారం వారు ప్రారంభించారు. కేవలం దాతలు అందించిన సహాయంతోనే ఆలయ నిర్మాణంతో పాటు ఇతర వసతుల కల్పన చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు పద్మ, వెంకటేశ్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా సర్వే చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఎన్యుమరేటర్లు పారదర్శకంగా సమగ్ర సర్వే పనులను చేయాలని మండల పీఆర్ ఈఈ మండల ప్రత్యేక అధికారి నర్సింలు అన్నారు. శుక్రవారం మండలంలోని లింగారెడ్డిపేట్, తదితర గ్రామాల్లో సమగ్ర సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. లింగారెడ్డిపేట్‌కు చెందిన ఎన్యూమరేటర్‌ల్లో లక్ష్మి అనే మేట్ తనకు ఇచ్చిన 156 కుటుంబాల సర్వేను 100 శాతం పూర్తి చేసినందున ఆమెను శాలువాతో సత్కరించారు. వీరి వెంట ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి సర్వే ప్రశాంతంగా కొనసాగుతుందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో సర్వే విషయమై ఎన్యుమరేటర్ల పనితీరు పరిశీలించామన్నారు.

4,336 కుటుంబాల సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు 4,336 కుటుంబాలను ఎన్యుమరేటర్లు సర్వే చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రం కౌడిపల్లిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా పాల్గొన్నారు.



కౌడిపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి(తూప్రాన్): సమగ్ర కుటుంబ సర్వే ఉమ్మడి వెల్దుర్తి మండలంలో చురుగ్గా కొనసాగుతుందని ఎంపీఓ విఘ్నేశ్వర్ అన్నారు. మండలంలోని ఉప్పులింగాపూర్, భస్వాపూర్‌లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెల్దుర్తి మండలంలో 9,283 కుటుంబాలకు 3,690, మాసాయిపేట మండలంలో 4,465 కుటుంబాలకు 2,151 కుటుంబాల ఇంటింటి సర్వే పూర్తయిందన్నారు. గడువులోగా ఎన్యుమరేటర్లు సర్వే ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **గోశాలకు పశుగ్రాసం అందజేత**



శివంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతిలో కొలువైన వేణుగోపాలస్వామి గోశాలకు దాత శుక్రవారం ఎండు పశుగ్రాసం అందజేశాడు. తూప్రాన్‌కు చెందిన గంప సుజాత సిద్ధిరాములు దంపతులు రూ.30 వేల విలువ చేసే పశుగ్రాసాన్ని గోశాల నిర్వాహకులకు అందజేశారు. గోశాల్లో పశుగ్రాసం కొరత ఉందని దాతలు అందివ్వాలని గోశాల ఫౌండర్ సుబ్రహ్మణంశర్మ కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా ఉన్నారు.

◆ **మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయింది. దీంతో నీరు వృథాగా పోతుందని అదే సమయంలో కలుషిత నీరు కూడా పైప్‌లైన్‌లోకి వెళ్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషితనీరు తాగి అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని వారు వాపోయారు. మిషన్ భగీరథ అధికారులు స్పందించి, పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని కోరారు.

◆ **సద్వినియోగం చేసుకోవాలి**

శివ్వంపేట(నర్సాపూర్): రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏపీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలో అవసరమున్న చోట్లల్లో కేంద్రాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

◆ **అయ్యప్ప దీక్షల స్వీకరణ**

పెద్దశంకరంపేట(మెదక్): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పలువురు భక్తులు శుక్రవారం అయ్యప్ప దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయంలో గురుస్వామి రామచంద్రా స్వామి ఆధ్వర్యంలో పలువురు అయ్యప్ప దీక్షలు స్వీకరించారు.

◆ **ఆర్థిక సాయం**

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళి ఘణాపూర్‌కు చెందిన ఇద్దరు యువకుల కుటుంబాలకు లీలాగ్రూప్ అధినేత డా. మోహన్‌నాయక్ శుక్రవారం ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందజేశారు. గ్రామానికి చెందిన చాకలి విజయ్, పవన్‌కల్యాణ్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్ ముదిరాజ్, సురేష్ నాయక్, లక్ష్మయ్య, టైలర్ కృష్ణ, శ్రవణ్, మెదక్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నారాయణ, స్వరూప, వెంకటేష్ గుప్తా, శంకర్, తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264